

# అద్వైతం

## – శారద (బ్రిస్బేన్)

### (క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)

1994 – మార్చి

సీఫెల్ కాంటీన్‌లో కూర్చుని వున్నారు అశోక్, భానూ.

"చెప్పమ్మా తల్లీ! ఏమిటి విశేషాలు? ప్రయణాలవీ బాగా జరిగాయా? ఇంట్లో, వూళ్ళో అంతా బాగున్నారా? తమరి దర్శనం జరిగి కొన్నేళ్ళైనట్టుంది," టేబిల్ మీద వేళ్ళతో తాళం వేస్తూ అన్నాడు అశోక్.

"అబ్బో, ఈ వెటకారాలకేం తక్కువ లేదు మరి! వొచ్చి మూడు వారాలైంది. రాగానే జ్వరాన పడ్డాను. ఆ జ్వరం తగ్గింతరవాత ఆఫీసుకి తప్ప అమ్మ ఇంట్లోంచి కదలనివ్వలేదు. ఒకటి రెండుసార్లు నీకు ఫోన్ చేద్దామనుకున్నా కానీ.."

"ఊ..కానీ? ఫోన్ చేయలేదెందుకని?"

"అబ్బ, ఏదో వదిలేయవోయ్! అసలు ఆ ఆఫీసు పని తోనే తల పగిలి చస్తూంటే నువ్వు కూడా విసిగించకు అశోక్! నువ్వు చెప్పు, విశేషాలేంటి? సూసీ వాళ్ళింటికెళ్ళావా ఈ మధ్య? ఆ ద్రోహి పెళ్ళయింతరవాత మా పేర్లు కూడా మరిచిపోయినట్టుంది."

నవ్వాడు అశోక్.

"కొత్తగా పెళ్ళైన వాళ్ళలాగే వుంటారేమోలే. వాళ్ళు నాలుగు వారాలు సౌత్ ఇండియా అంతా తిరిగొస్తామని టూర్ ప్రోగ్రాం వేసుకొని వెళ్ళారు. ఆశా, ఒకటి రెండు సార్లు మార్కెట్లో కలిసింది. నేను పీహెచ్‌డీ పనితో ఎప్పట్లాగే బిజీ. మా ప్రొఫెసర్ మంచి వాడే కానీ, చాలా ఎక్స్పెక్ట్ చేస్తాడు పని విషయంలో."

భాను ఏమీ మాట్లాడలేదు.

"ఏమయింది భానూ? అంత డల్‌గా వున్నావెందుకు? ఏదైనా ప్రాబ్లమా? ఆఫీసులో అంతా ఓకేనే కదా?" కాఫీ కప్పు కింద పెడుతూ అన్నాడు అశోక్.

"అది కాదు, అశోక్. నాకే, అసలు లైఫ్ ఎటు పోతోందో అర్థం కావడంలేదు. నాకు పై చదువుల మీద పెద్ద ఆసక్తి లేదని ఉద్యోగంలో చేరానా? మెల్లగా అమ్మ పెళ్ళి పెళ్ళి అంటూ గోల మొదలు పెడుతోంది. పోనీ, ఆ గోల రెండేళ్ళు వొదిలించుకోవడానికైనా ఎంటెక్ చదవనా?"

నవ్వాడు అశోక్.

"ఇష్టం లేని పని వీలైనంతవరకూ తప్పించుకోవాలమ్మాయ్! పోనీ, మీ అమ్మ చెప్పినట్టు పెళ్ళి చేసుకోవచ్చుగా? వాటిజ్ ది ప్రోబ్లెం?"

"నా బొంద, నాకింకా ఇరవై రెండేళ్ళే! ఉద్యోగంలో చేరి కనీసం యేడాదైనా కాలేదు! అప్పుడే ఏం పెళ్ళి? నేను ఇంకొక రెండేళ్ళు నా ఆఫీసుమీదా, ప్రొఫెషన్ మీదా ఫోకస్ చేస్తా అశోక్. ఆ తరవాతే పెళ్ళి."

"మరింకేం? నీ మనసులో ఏముందో నీకు క్లియర్‌గా తెలుసు కదా? అదే సంగతి అమ్మా, నాన్నలతో చెప్పేయ్. వాళ్ళు తప్పకుండా అర్థం చేసుకుంటారు."

"అవుననుకో. కానీ ఏదేదో సంబంధాలంటూ, ఎవరో ఏదో కెలుకుతారు."

"వాళ్ళ వైపు నుంచి చూస్తే, వాళ్ళ ఆలోచనా కరెక్టే. నీకు ఇప్పుడొస్తున్నట్టు సంబంధాలు రెండేళ్ళ తరవాత రాకపోవచ్చుకదా? అది వాళ్ళ వాదన."

"అది సరే! నీ భవిష్యత్తు గురించి నువ్వేం ఆలోచిస్తున్నావ్ అశోక్?"

ఒక్కసారి లోతుగా ఆమె కళ్ళల్లోకి చూసాడు అశోక్.

"నాకు భవిష్యత్తు అంటూ పెద్దగా ప్లాన్‌లు లేవు భానూ. నీకు తెలుసుగా, నేను ఆంబిషన్ కంటే ప్రశాంతతకి ఎక్కువ విలువ ఇస్తాను. ఈ పీహెచ్‌డీ ముగించి, మంచి కాలేజీలో ఇంగ్లీషు లెక్చరరుగా స్థిరపడాలని వుంది. ఆ పైన నాకు ప్రాణప్రదమైన నాట్యం వుండనే వుంది. ఈ రెండిటి మధ్యా జీవితాన్ని ప్రశాంతంగా గడపాలన్నదే నా ఆశ."

"నువ్వు పెళ్ళి గురించి ఏమీ ఆలోచించవా అశోక్?"

" ఇంకో రెండేళ్ళ తరవాత పెళ్ళి చేసుకుంటాననుకో. ఇంకా దాని గురించి పెద్దగా ఆలోచించలేదు ఇప్పటివరకూ."

భాను మొహం కొంచెం వాడిపోయింది.

"పద, అలా లైబ్రరీ దాకా వెళ్ళొద్దాం. ఈ పుస్తకాలన్నీ లైబ్రరీలో తిరిగి ఇచ్చేయాలి," లేస్తూ అన్నాడు అశోక్.

"వామ్మో, ఇన్ని పుస్తకాలా? ఇన్నిన్ని చదవటానికి నీకు తీరికెక్కడుంటుంది?"

"అందులో కొన్ని నేను చదవటానికి, కొన్ని మా స్టూడెంట్స్‌తో చదివించటానికి. ఎంసెట్ ఎంట్రన్సుల వల్ల పిల్లలకసలు చదివే అలవాటే పోతుంది తెల్సా! మరీ ఇంటర్మీడియేట్ పిల్లలకైతే భాషల మీద కొంచెం కూడా ఆసక్తి లేదు."

"అబ్బ, మరీ ముసలాడిలా మాట్లాడకు అశోక్. నీ మాటలు వింటూ వుంటే, నేనేదో వందేళ్ళ క్రితం ఎంసెట్ రాసిన ఫీలింగొస్తుంది నాకు."

ఇద్దరూ నవ్వుకుంటూ లేచారు.

★★★★★★★★★★★★

1994–ఆగస్టు

డియర్ భానూ,

హేపీ బర్త్‌డే– మనిద్దరికీ.

శనివారం, ఆరో తారీకు–మినర్వాకి లంచి కొచ్చేయి. పన్నెండు గంటలకి.

నిన్ను చూసి చాలా రోజులయింది. నీతో చాలా మాట్లాడాలి.

పుట్టినరోజునాడు ఫోన్ చేద్దామనుకున్నాకానీ, ఆ రోజంతా బయటే తిరుగుతూ వున్నా. అందుకే ఫోన్ చేసే ఛాన్సే దొరకలేదు.

వుంటా,

నీ

అశోక్.

"నీ అశోక్" అన్న మాటలకు భాను మనసు ఎప్పట్లాగే గిలిగింతలెత్తింది. ఆఫీసునించి వచ్చేసరికి ఆమెకొచ్చిన బర్త్‌డే గ్రీటింగ్స్ కార్డుల్లో వున్న ఆ చిన్న కార్డు, చూడగానే మనసు ఉరకలెత్తింది. ఇంకా నయం, అమ్మ తెరిచి చదవలేదు. చూసిందంటే ప్రశ్నలేసి చంపేసేది.

ఒక వంద యుగాలు గడిచింతరవాత కానీ శనివారం రాలేదు. ప్రతీ యేడూ లాగే పుట్టినరోజుకని అమ్మ కొనిచ్చిన డ్రస్సుతోపాటు అమ్మకి చెప్పకుండా తను క్రితం రోజు కొన్న సల్వార్ కమీజ్ తీసి చూసుకుంది. ఎర్రటి కుర్తా కింద బిస్కెట్టు రంగు పైజామా, చాలా నచ్చి కొనుక్కొని తన సైజుకు ఫిట్టు కూడా చేయించుకుంది. స్నానం చేసి ఆ డ్రస్సు వేసుకొని, చెవులకి ఎర్రటి బుట్టలు పెట్టుకొంది. మొహాన చిన్న బొట్టు, కళ్ళకి కాటుకా పెట్టుకొని, వదులుగా జడేసుకుంది.

పదకొండున్నరకి అలంకరణ ముగించి బయల్దేరుతున్న భానుని చూసి ప్రభావతి ఆశ్చర్యపోయింది.

"ఎక్కడికే బయల్దేరావు? అది సరే, నాతో ఎక్కడికైనా రమ్మంటే ఏదో ఒకటేసుకొని తయరవుతావు కదా, ఇప్పుడు చూడెంత ముద్దుగా వున్నావో! ఎప్పుడూ ఇలాగే తయారవొచ్చుగా? ఈ డ్రస్సు ఎంత బాగుందో! ఇదెప్పుడు కొనుక్కున్నావ్?"

"ష్యూర్ ప్రశ్నల ప్రభావతీ!" నవ్వుతూ అమ్మ బుగ్గమీద ముద్దు పెట్టుకొని బయల్దేరింది.

"ముద్దులు సరే, ఇంతకీ ఎక్కడికే?"

"ఫ్రెండ్స్ అందరమూ కలిసి బయటే భోజనం చేసి, వీలైతే సినిమా కూడా చూసొస్తాం. నా బర్త్‌డే పార్టీ లాగనుకో!"

"ఎవరెవరొస్తున్నారు?"

అమ్మ ప్రశ్న విననట్టే నటిస్తూ ఇంట్లోంచి బయట పడింది భాను.

మినర్వా ముందు స్కూటీ పార్క్ చేసేసరికి పన్నెండయి పది నిమిషాలయింది. బయట ఎంట్రన్సు దగ్గరే నిలబడి వున్నాడు అశోక్.  బ్లూ జీన్స్ లోకి నల్లటి షర్టు టక్ చేసి, నవ్వు మొహంతో వున్న అతన్ని చూడగానే గుండె కొట్టుకునే వేగం పదింతలైందేమో అనిపించింది భానుకి.

"హలో మిస్ రెడ్ రోజ్! బాగున్నారా? కొత్త బట్టలూ, కొత్త బండీ! అబ్బో, జోరు మీదుందే అమ్మాయిగారి వ్యవహారం!"

" నీ పలకరింపు ఏదో పాత గూఢచారి సినిమాలోలావుంది! సరే కానీ, ఎలా వుంది నా కొత్త స్కూటీ? అమ్మ ఎక్కువ దూరం నడపనీయదనుకో! ఇంటి చుట్టుపక్కలే, తిప్పుతూ వున్నాను. ఇవాళ ఇదిగో, ఇంత దూరం వొచ్చాను. పద పద, లోపలికెళ్దాం. నాకు బాగా ఆకలేస్తుంది."

"నీకు ఎరుపు రంగు బాగా సూటయింది. ఈ డ్రస్సు చాలా బాగుంది. సరే, ఇంతకీ ఏం తింటావో చెప్పు."

"నాకు ఒక నాన్, కుర్మా ఇంకా బిర్యానీ కావలి!"

"అబ్బో! అంత తినగలననే? సరే, నీ ఇష్టం," అని ఆర్డరిచ్చాడు అశోక్.

"ఇప్పుడు చెప్పు! మనం కలిసి దాదాపు ఆరు నెలలయింది కదా? ఎలా వున్నావు? ఉద్యోగం ఎలా వుంది? ఫ్రెండ్స్ ఎలా వున్నారు?"

"అంతా మామూలే అశోక్. ఉద్యోగం బాగానే నడుస్తుంది. అప్పుడే అక్కడ చేరి యేడాది దాటిపోయింది! ఆఫీసు అలవాటైపోయిందిలే. కోమలీ, ఆశా ఒకసారి కలిసారు కానీ, సూసీ ఐతే అసలు కనబడనే లేదు. నీ సంగతి చెప్పు. ఏమిటి విశేషాలు?"

"ఏముంటాయి, నా బొంద! అంతా రొటీన్. పీహెచ్‌డీ నడుస్తూ వుంది. కాలేజీ కొత్త సంవత్సరం మొదలైంది కదా? మా కాలేజీ డిగ్రీ కూడా మొదలు పెట్టారు. అప్పుడప్పుడూ డిగ్రీ ఫస్ట్ ఇయర్ పాఠాలు చెప్తూ వున్నాను. ఆరేళ్ళ కింద నేను డిగ్రీ ఫస్ట్ ఇయర్! కొంచెం వింతగా అనిపిస్తూ వుంది కానీ, పర్వా లేదు. అయితే అనుభవం లేకుండా లెక్చరరు ఉద్యోగం కష్టమే! ”

"అమ్మా ఎలా వుంది? చాలా రోజులైంది తనని కలిసి."

"బానే వుంది. ఇప్పుడే బీకాం రెండో యేడు మొదలైంది. వచ్చే యేడు రాయబోయే బాంకు పరీక్షలకి ఇప్పణ్ణించే ప్రిపేరవుతోంది!"

"తప్పకుండా బాంకు వుద్యోగం కొడుతుంది తను."

"అప్పుడందరూ మెచ్చుకుంటారు దాన్ని. అన్న ఇంకా పీహెచ్‌డీ స్టూడెంటు, చెల్లె అప్పుడే బాంక్ ఎంప్లాయీ అని!"

నవ్వింది భాను. "మరి నీ లెక్చరర్ ఉద్యోగం ఏమైంది?"

"ఏమో, రిజల్ట్స్ రాలేదు. ప్రస్తుతానికైతే మా ప్రైవేటు కాలేజి. అయితే, ఒక సులువుంది ఈ ఉద్యోగంలో. వారంలో మూడు రోజులే కాలేజి. రెండు రోజులు సీఫెల్‌కెళ్తున్నా. అన్నట్టు నా పీహెచ్‌డీ టాపిక్ కూడా సెలెక్ట్ చేసుకున్నా తెలుసా?"

"అవునా? ఏంటి టాపిక్?"

"ఇంగ్లీషు సాహిత్యం మీద భారతీయ ఆంగ్ల సాహిత్య కారుల ప్రభావం గురించి– అదీ ఎక్కువగా రాజా రావు, ముల్క్ రాజ్ ఆనంద్, ఆర్ కె నారాయణ్ ల సాహిత్యాలని ప్రస్తావిస్తూ. వాళ్ళు ముగ్గురూ సమకాలీకులు."

"అంటే మనవాళ్ళు కూడా ఇంగ్లీషులో రాసారా?"

"బోలెడంత మంది! వాళ్ళే కాదు, కమలా మార్కండేయ, అమృతా ప్రీతం, నైపాల్, చాలా మంచి పుస్తకాలు వ్రాసారు. వీళ్ళందరికంటే నా పర్సనల్ ఫేవరిట్ ఉపమాన్యు చటర్జీ! వీళ్ళంతా అద్భుతమైన రచయితలు."

"మరి తెలుగులో నీ ఫేవరిట్ రచయితలెవరు?"

"ఇంకెవరు? కథా రచయితలందరికీ తాత, కుటుంబరావు."

"నీకింతమంది రచయితలెలా తెలుసు అశోక్?"

"మా అమ్మా నాన్నా బోలెడు పత్రికలు తెప్పించేవారు. అవన్నీ నేనూ బాగా చదివేవాణ్ణి."

"మా ఇంట్లో అయితే పేపర్ తప్ప ఇంకేమీ తెప్పించరు!" నిట్టూర్చింది భాను.

ఇంతలో వెయిటర్ భోజనం పట్టుకొచ్చాడు.

"ఎట్ లాస్ట్! ఎంత ఆకలిగా వుందో తెలుసా?" పళ్ళెంలో కూర వడ్డించుకుంటూ అంది భాను.

భోజనం ముగించి బాసుందీ తెప్పించుకున్నారు.

"హమ్మ, ఎంత తిండి తిన్నానో ఇవాళ అశోక్. ఇక నాలుగు రోజులు కదిలలేను. కొండ చిలవ లాగా ఒక దగ్గర పడి వుంటా రేపంతా."

"చాల్లే! ఏదో పెద్ద తినేదాన్లా మాటలే ఎక్కువ. అది సరే కానీ, నీ ఆఫీసు కబుర్లు చెప్పు. వాడెవడూ, ప్రదీప్, ఎలా వున్నాడు? ఇంకా నీకు లైనేస్తూనే వున్నాడా?"

"వాడి మొహం. నా చుట్టూ ఎంత తిరిగినా లాభం లేదని రెండు నెలల కింద చెప్పేసాను. లక్కీగా అతనికింకో చోట ఇంకా మంచి వుద్యోగం వచ్చిందట. వెళ్ళిపోయాడట."

"అయ్యో పాపం! నువ్వు చాన్సు మిస్సయ్యావన్నమాట."

"పిచ్చి జోకులు ఆపు అశోక్! అన్నట్టు, ఏదో మాట్లడాలన్నావు? ఏంటది? "

ఒక్క క్షణం గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు అశోక్.

"ఆ రోజు మనం మాట్లాడుకున్న తరవాత సీరియస్‌గా ఆలోచించాను."

"దేని గురించి?"

"అదే, నా పెళ్ళిగురించి!"

"అబ్బ వూరుకో, అశోక్. ఆ రోజు నేనేదో అంటే, నువ్వు నన్ను వేళాకోళం చేస్తున్నావు." భాను ఎర్రబడ్డ మొహంతో అంది.

"అరే, వేళాకోళం కాదమ్మాయ్! చెప్పేది పూర్తిగా విను. మనిద్దరం పెళ్ళి చేసుకోవడం గురించి, వాట్ డు యూ థింక్? నేనంటే నీకు ఇష్టమనే అనుకుంటున్నా, కానీ పెళ్ళాడేంత ఇష్టం వుందా?"

అతనలా అడగాలని ఎంతగా ఆశపడ్డా, నిజంగా ఆ క్షణం ఎదురైనప్పుడు తత్తరపడింది భాను.

"ఇంత రకీమని అడుగుతాననుకోలేదేమో నువ్వు! కానీ ఆ ప్రదీప్ గాడి మీద నాకెప్పణ్ణించో నాకనుమానం. నేను తొందరపడకపోతే, వాడు నిన్నొప్పించేస్తే!"

"అబ్బో! ఈ కొంటె మాటలకేం కానీ, నిజంగా అంటున్నావా, నన్ను ఆట పట్టిస్తున్నావా?"

"ఓకె, లెటజ్ బీ సీరియస్. నిజంగా నువ్వంటే నాకు చాలా ఇష్టం భానూ. కానీ, నన్ను పెళ్ళి చేసుకోవడం గురించి నువ్వే చాలా విషయాలు ఆలోచించుకోవాలి. నీలాటి అమ్మాయి ఇష్టపడటమే భాగ్యమనుకోవాల్సినంత మంచి అమ్మాయివి నువ్వు. నాతో నీ బ్రతుకు ఎంత సాఫీగా నడుస్తుందో చెప్పలేను. నీ స్నేహితులూ, బంధువులూ వున్నంత డబ్బులో మనం వుండలేకపోవచ్చు. వీ విల్ బి రీజనబ్లీ కంఫర్టబుల్. ఐతే, అమ్మదీ, అమ్మూదీ బాధ్యత ఎప్పటికీ మనదే. అమ్మూ పెళ్ళికని అమ్మ డబ్బు దాచింది, కాబట్టి మనకి పెద్దగా ఇబ్బంది వుండకపోవచ్చు కానీ, అమ్మ మాత్రం ఎప్పటికీ మనతోనే వుంటుంది. అలాగే నువ్వూ మీ అమ్మా నాన్నలకొక్కదానివే. కాబట్టి వాళ్ళ బాధ్యతా మనదే అవుతుంది. ఆ బాధ్యత తీసుకోవడానికి నాకే సమస్యా లేదు. నేను ఇంగ్లీషు సాహిత్యంలో తప్ప వేరే ఏ ఉద్యోగమూ చేయలేను. సాఫ్ట్‌వేరు

ఉద్యోగాలూ, అమెరికా వెళ్ళి డాలర్లు సంపాదించడమూ నావల్ల కాదు, నాకు ఇష్టమూ లేదు. కాబట్టి ఆర్థికంగా అంత గొప్పగా వుంటామో లేదో చెప్పలేను.  దానికి తోడు నా నాట్యం! మరి నా నాట్యం గురించి నువ్వూ, మీ ఇంట్లో ఏమనుకుంటున్నారో తెలియదు. నాతో ఇన్ని ఇబ్బందులు వుంటాయి. ఐతే, నీకు ఏ కష్టమూ రాకుండా చూసుకోగలననే నమ్మకం నాకైతే వుంది. నీకూ ఆ నమ్మకం వుందో లేదో నువ్వే ఆలోచించి చెప్పాలి."

భాను ఏమీ మాట్లాడలేదు.

"తొందరేమీ లేదు భానూ. నువ్వు అమాయకురాలివి. నీకు నా మీద వున్న అభిమానాన్నీ, స్నేహాన్నీ ఉపయోగించుకోని నిన్ను ఎమోషనల్‌గా కార్నర్ చేసి ఒప్పించడం నా ఉద్దేశ్యం కానే కాదు. మనిద్దరికీ ఏమీ వయసు మీరి పోవడం లేదు. బోలెడంత టైముంది. టేక్ యువర్ టైం. ఒకవేళ నువ్వు ఇప్పుడు వెనకడుగు వేసినా, డిజప్పాయింట్ అవుతాను కానీ, ఐ కెన్ అండర్‌స్టాండ్. అసలు,..."

అడ్డం వొచ్చింది భాను.

"నువ్వొక్కసారి మాటలుఆపితే, నేనొక్క మాట చెప్పాలి."

"చెప్పు."

"సరే."

"ఏమిటి సరే?"

"నీ బొంద! నన్ను పెళ్ళిచేసుకుంటావా, అని అడిగావు కదా, దానికి సరే ."

"నువ్వు నాకంటే ఫాస్టుగా వున్నావమ్మాయ్!"

సంతోషంగా పళ్ళన్నీ బయట పెట్టి నవ్వాడు అశోక్.

అప్పటికే వాళ్ళు బోజనం చేసి పావుగంట దాటడంతో వెయిటర్ వాళ్ళ చుట్టూ తిరగసాగాడు, ఇక లేవమన్నట్టుగా.

"భానూ, మనలని వీడు బయటికి పంపాలని చూస్తున్నాడు. ఉండు, ఇంకో రౌండు కాఫీ తాగుదాం."

అశోక్ వెయిటర్‌ని పిలిచి రెండు కాఫీలు తెమ్మని అడిగాడు. అతను వాళ్ళిద్దరి వంకా గుర్రుగా చూసి కాఫీ తేవడానికి వెళ్ళాడు.

"నువ్వు చెప్పినవన్నీ నేనూ కూడా ఆలోచించాను అశోక్. ముగ్గురు పెద్దవాళ్ళ బాధ్యత మనం తీసుకుందాం. అమూల్య చక్కగా చదువుకుని ఉద్యోగం కూడా సంపాదించుకుంటుంది. తన పెళ్ళి జరిపించడం మనకి పెద్ద కష్టం కాదు. ఏదైనా కష్ట నష్టాలొచ్చినా ఇద్దరమూ చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నాం. సంబాళించుకోలేకపోము. నాకైతే ధైర్యంగానే వుంది. అయితే.."

అని కొంచెం సందేహంగా ఆగిపోయింది.

"అయితే, ఏంటి?"

"అదీ, నేనిలా అడుగుతున్నాని ఏమీ అనుకోకు అశోక్. ఇది నా ప్రశ్న కాదు. మా అమ్మా నాన్నలు అడిగబోయే ప్రశ్న, నన్ను తప్పుగా అర్థం చేసుకోవద్దు ప్లీజ్!"

"అబ్బా, ఇంత సస్పెన్సొద్దమ్మా! సంగతేమిటో అడుగు. మనసులో దాచుకోవడం వల్ల ఏం ప్రయోజనం?"

"మీ కులం గురించి మా వాళ్ళడిగితే ఏం చెప్పాలి?"

"అవును, ఐ అండర్‌స్టాండ్. ఆ మాటకొస్తే మా అమ్మ కూడా తప్పక అడుగుతుంది. ఇలాటి విషయాలు ఆలోచించడానికే ఎంత ఇబ్బందిగా ఉంటాయి కదా? సరే, ఇప్పుడే చెప్తున్నాను. నీ కులం ఏదైనా, ఐ రియల్లీ డోంట్ కేర్. మా కులం పేరు ఏ."

"హ్మ్. మొదటి అడ్డంకి మొదలైందన్నమాట. మా కులం పేరు బి."

నవ్వాడు అశోక్.

"అన్నట్టు భాను, నేను పూర్తిగా శాకాహారిని."

"నేనూ, మా ఇంట్లో అంతా నాన్-వెజిటేరియన్స్!"

" ఆ విషయంలో నాకేమీ పట్టింపో, సమస్యో లేదు.భాను. నీకిష్టమైనట్టు నువ్వు తిను, నాకిష్టమైనట్టు నేను తింటా. నిజానికి చాలా విషయాలు మనకి ముందు ముందు కాలాల్లోనే అర్థమవుతాయేమో. ఇప్పుడే అన్నిటినీ ప్రెడిక్ట్ చెయ్యలేం భానూ. ముందున్న జీవితాన్నంతా ఇప్పుడే ఊహించడానికి ప్రయత్నించకు."

"సరే, అయితే మరి మన ప్లాన్ ఏమిటి?"

"నేను పీహెచ్‌డి ముగించేసరికి ఇంకో రెండేళ్ళయినా పడుతుంది. నీకూ తొందరేం లేదుగా?"

"ఏమీ తొందరలేదు.రెండేళ్ళ వరకూ తొందర లేదు. నువ్వు ఎప్పుడు సరేనంటే అప్పుడే ఇంట్లో చెప్తాను. ఈ లోపల ఏదో సంబంధమని ఇంట్లో గొడవ చేస్తే తప్ప."

"డన్."

ఇంతలో కాఫీ వొచ్చింది. కాఫీ తాగి బయట పడ్డారిద్దరూ.

★★★★★★★★★★★★★★★★

డియర్ అశోక్,

ప్రపంచంలో ఎవరికీ తెలియని రహస్యమేదో మనిద్దరికి మాత్రమే తెలుసన్న సంతోషం నన్ను నిలవనీయటంలేదు. ఒక లాటి తేలిపోతున్న భావన రెండురోజులనించీ నా మనసుకి రెక్కలు తొడిగింది. నువ్వెలా

వున్నావ్? అసలు ఆ రాత్రి నిద్ర పట్టిందా నీకు? నిజం చెప్తున్నా! ఒక్క క్షణం కూడా నిద్ర పోలేదు నేను. కన్నంటుకున్నట్టే అనిపించడం, కడుపులో అంతా ఏదో సీతా కోక చిలుకలు ఎగురుతున్న ఫీలింగుతో లేవడం, రాత్రంతా ఇదే తంతు.

అసలు మన పరిచయం తలచుకుంటే ఎంత గమ్మత్తుగా వుంటుంది! నిన్న ఆ పాత సైకిలంతా శుభ్రంగా తుడిచి రంగు రంగుల దారాలతో ముస్తాబు చేస్తూంటే, అమ్మ భలే ఆశ్చర్యపోయింది.

కొత్త స్కూటీ కొనుక్కున్నావుగా, పాత సైకిల్కి ఎందుకే అంత ముస్తాబు, అని ఒకటే సతాయించింది. ఊరికే సాయంత్రాలు అలా సైకిల్ మీదెక్కి మనం మొదటిసారి కలుసుకున్న పార్కు వరకూ  వెళ్ళొస్తూ వున్నా.

ఈ ఉత్తరం మీ ఇంటి అడ్రసుకి పోస్టు చేయాలంటే మొహమాటం వేసి, సీఫెల్ అడ్రసుకి పోస్టు చేస్తున్నా. అందుతుందో లేదో. కింద మా ఆఫీసు అడ్రసు ఇస్తున్నా. జవాబు అక్కడికి రాయి.

అవునూ, నువ్వు ప్రపోజ్ చేయటానికి ఉంగరం ఏదీ తేలేదే? ఛ, ఒప్పుకోకుండా ఉండాల్సింది. మంచి రవ్వల ఉంగరం తేకపోతే పెళ్ళి కేన్సిల్! ముందే చెప్తున్నా! ముందా పని చూడు.

వుండనా

భాను

భానూ,

నీ ఉత్తరం క్షేమంగా నా దగ్గరకొచ్చింది.

అసలు లిటరేచర్ చదివేది నేనైతే, నీ వుత్తరాలు ఇంత బాగుంటాయేం? ఇది నాకేం నచ్చలేదమ్మాయ్!

మనం ప్రతి ఆల్టర్నేట్ శనివారం సీఫెల్ కాంటీన్‌లో కలిసి లంచ్ చేయడం అనే ప్లాన్ గురించి నీ అభిప్రాయం ఏమిటి? అంటే, వచ్చే శనివారం కాక ఆ పై శనివారం సీఫెల్ కేంటీన్ దగ్గర కలుద్దామా? నీకు ఇంకేదైనా పనుంటే చెప్పు.

ఒక అదివారం ఆ పార్కుకి వెళ్దామా? కావాలంటే మళ్ళీ నీ సైకిలు కింద పడతాను.

ఉంగరం గురించి అడిగావు. నాకెందుకో అలా వుంగరం అదీ పట్టుకొచ్చి  ఇబ్బంది పెట్టడం నచ్చదు భానూ. ఒకవేళ నేను తీసుకొచ్చిన ప్రస్తావన నచ్చకపోతే? ఇప్పుడిక నీకూ ఇష్టమేనన్న మంచి కబురు చెప్పావు కాబట్టి మన ఎంగేజ్‌మెంట్ నాటికి నువ్వడిగిన రవల వుంగరం రెడీగా వుంటుంది సరేనా?

మీ అత్తగారూ ఆడపడుచూ క్షేమం. మా అత్తగారినీ, మామగారినీ అడిగినట్టు చెప్పు.

అశోక్.                *******************

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS